సాక్షి విశాఖపట్నం

7

గురువారం । 29 । జూన్ । 2023

న్యూస్‌రీల్

తుది విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై తుది విడత చందనం అరగదీత బుధవారం నుంచి ప్రారంభమైంది. వచ్చేనెల 3వ తేదీన ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించేందుకు కావాల్సిన మూడు మణుగుల పచ్చి చందనాన్ని (125 కిలోలు) సమకూర్చేందుకు శాస్త్రోక్తంగా అరగదీత చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది 31 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో 96 కిలోల కిలోల చందనం అవసరం కాగా మరో మూడు రోజులపాటు అరగదీత జరగనుంది.

మానసిక ఆస్పత్రిలో ముగిసిన 'ఎన్‌ఏబీహెచ్' పర్యటన



ఉద్యోగులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్‌ఏబీహెచ్) బృందం రెండు రోజుల పర్యటన ముగిసింది. కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన నిపుణులు మంగళ, బుధ వారాల్లో ఆస్పత్రిలో వసతులు, వైద్యుల పనితీరు, ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, పనితీరు మెరుగుపరుచుకునేందుకు తీసుకుంటున్న చర్యలను సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి బృంద సభ్యులకు వివరించారు. ఆస్పత్రి నిర్వహణ పట్ల సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారని, త్వరలోనే ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. సేకరించిన వివరాలతో నివేదిక రూపొందించి ఎన్‌ఏబీహెచ్ ప్రధాన కార్యాలయానికి పంపనున్నట్లు బృంద సభ్యులు తెలిపారు.

గిరి ప్రదక్షిణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయండి

డాబాగార్డెన్స్: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ భక్తులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి కమిషనర్ లుంబిని పార్క్, సీతమ్మధార, కైలాసపురం, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, ఎస్ఎస్‌టీఎల్ రోడ్డు, పాత గోశాల, అడవివరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణ జూలై 2 ఉదయం నుంచి 3వ తేదీ ఉదయం వరకు జరుగుతున్నందున రాత్రి సమయంలో భక్తులకు నడక మార్గంలో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వీధి దీపాలతోపాటు అవసరమైన చోట్ల అదనంగా ఫోకస్ లైట్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అదనంగా ఎన్ని లైట్లు ఏ ఏ ప్రాంతాల్లో అవసరమవుతాయో ముందుగా అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

సీతమ్మధార: బక్రీద్ సెలవు అయినప్పటికీ.. గురువారం జిల్లాలోని అన్ని విద్యుత్ రెవెన్యూ కార్యాలయాల్లోని విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు పని చేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎల్.మహేంద్ర నాథ్ తెలిపారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతో పాటు సెక్షన్ కార్యాలయాల్లోని వసూళ్లు, ఏటీపీ కేంద్రాల్లో బిల్లులు చెల్లించవచ్చన్నారు.

ఏయూలో జాబ్‌మేళా రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మోడల్ కెరీర్ సెంటర్, యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ గైడెన్స్ బ్యూరో, నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఈ నెల 30న వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటి చీఫ్ కె.దొరబాబు ప్రకటనలో తెలిపారు. ట్రినిటెక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇండియా లిమిటెడ్‌లో 30 ఖాళీలు భర్తీ చేస్తామని 18–30 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులన్నారు. వీరికి వేతనంగా రూ.12 నుంచి రూ.50 వేల వరకు అందిస్తారన్నారు. డిప్లమా, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులని తెలిపారు. మెడ్‌ప్లస్‌లో మొత్తం 140 ఖాళీలు ఉన్నాయని, ఫార్మసీ, పదో తగతతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. వీరికి వేతనంగా రూ.11,000 నుంచి రూ. 15 వేల వరకు అందిస్తారన్నారు. ఆసక్తి గల వారు ncs.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

స్మార్ట్ షెల్టర్లు

నగరంలోని రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతున్న గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) ప్రయాణికుల సౌకర్యార్థం సరికొత్త డిజైన్లు, అత్యాధునిక హంగులతో స్మార్ట్ బస్ షెల్టర్‌లను నిర్మిస్తోంది. రూ.4.62 కోట్లతో జీవీఎంసీ పరిధిలో 20 బస్ షెల్టర్ల ఆధునికీకరణ పనులు ప్రారంభించగా కొన్ని తుది దశకు చేరుకున్నాయి. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. ఆధునికీకరించిన బస్ షెల్టర్లలో ఆకర్షణీయమైన టైల్స్, ఎల్ఈడీ లైట్లు, డిజిటల్ బోర్డులు, మరికొన్ని బస్ షెల్టర్ల వద్ద వీలును బట్టి మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. – డాబాగార్డెన్స్



నిర్మాణ దశలో గురుద్వార బస్ షెల్టర్

- రూ.4.62 కోట్లతో 20 బస్ షెల్టర్ల ఆధునికీకరణ
- అత్యాధునిక హంగులతో నిర్మాణం

స్మార్ట్ నగరంలో సిటీ బస్ షెల్టర్ల ఆధునికీకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. జీవీఎంసీ జోన్–2 పరిధిలో రూ.90.80 లక్షలతో మూడు బస్ షెల్టర్ల పనులు ప్రారంభించగా.. ఆయా పనులు పూర్తి కావస్తున్నాయి. జోన్–3 పరిధిలో రూ.53.77 లక్షలతో నాలుగు బస్ షెల్టర్లను ఆధునికీకరిస్తున్నారు. ఇక్కడ పనులు చురుగ్గా సాగుతున్నాయి. జోన్–4 పరిధిలో రూ.51.93 లక్షలతో మూడు, జోన్–5ఏ లో రూ.1.61 కోట్లతో ఏడు, జోన్–6 పరిధిలో రూ.37.90 లక్షలతో ఒకటి, జోన్–8 పరిధిలో రూ.67.20 లక్షలతో రెండు బస్ షెల్టర్ల పనులు ప్రారంభించారు.

వివిధ దశల్లో పనులు

- జోన్–2 పరిధిలో రూ.37.90 లక్షలతో చేపట్టిన ఎండాడ జంక్షన్ బస్ షెల్టర్ ఫ్రేమ్ వర్క్ పూర్తయింది. ప్లాట్‌ఫాం, రిటైనింగ్ వాల్ పనులు చేస్తున్నారు. రూ.37.90 లక్షలతో కైలాసగిరి రోప్‌వే వద్ద నిర్మిస్తున్న బస్ షెల్టర్ ప్లాట్‌ఫాం పనులు జరుగుతున్నాయి. రూ.15 లక్షలతో నిర్మించిన పెదగదిలి, బాలాజీనగర్ బస్ షెల్టర్లు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి.
- జోన్–3 పరిధిలో రూ.8.47 లక్షలతో ఆధునికీకరిస్తున్న వెంకోజీపాలెం బస్ షెల్టర్ ప్లాట్ ఫాం పనులు జరుగుతున్నాయి. రూ.16.94 లక్షలతో చేపట్టిన ఆర్కే బీచ్ బస్ షెల్టర్ పనులు కొనసాగుతున్నాయి. రూ.15.10 లక్షలతో మద్దిలపాలెం బస్ షెల్టర్ పనులు తుది దశకు చేరుకున్నాయి. పాత్‌వే, స్క్రీన్ వాల్ పనులు జరుగుతున్నాయి. రూ.13.25 లక్షలతో ఆధునికీకరిస్తున్న గురుద్వార బస్ షెల్టర్‌లో గ్రానైట్ ఫ్లోరింగ్, అప్రోచ్ రోడ్డు, పాత్‌వే పనులు చేపడుతున్నారు.
- జోన్–4 పరిధిలో రూ.16.94 లక్షలతో చేపట్టిన ఆర్టీసీ కాంప్లెక్స్(222 బస్టాప్)లో వెల్డింగ్ పనులు చేపడుతున్నారు. రూ.19.89 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ బస్ షెల్టర్, ఎల్ఐసీ బిల్డింగ్ వైపు బస్ షెల్టర్, జగదాంబ జంక్షన్ బస్ షెల్టర్ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఉత్తర భాగంలో(లలితా జ్యువెలరీ వైపు) బస్ షెల్టర్‌ను రూ.15.10 లక్షలతో నిర్మిస్తున్నారు.
- జోన్–5ఏ పరిధిలో రూ.19.60 లక్షలతో రైల్వేస్టేషన్ ఔట్ గేట్, మరో రూ.19.60 లక్షలతో రైల్వే స్టేషన్ గ్లోసైన్ బస్ షెల్టర్ పనులు కొనసాగుతున్నాయి. రూ.12లక్షలతో రైల్వేస్టేషన్ ఏ1 క్లాడింగ్ షెల్టర్ పనులు జరుగుతున్నాయి. రూ.34.22 లక్షలతో నిర్మిస్తున్న అక్కయ్యపాలెం(సౌత్ లేన్) బస్ షెల్టర్‌లో ప్లింత్ బీమ్ పనులు పూర్తయ్యాయి. ఫ్రేమ్ నిర్మాణ దశలో ఉంది. రూ.19.60 లక్షలతో అక్కయ్యపాలెం(నార్త్ లేన్), రూ.36.48 లక్షలతో పోర్టు హాస్పటల్(సౌత్ లేన్), రూ.19.60 లక్షలతో పోర్టు హాస్పటల్(నార్త్ లేన్) బస్ షెల్టర్ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- జోన్–6 పరిధి కూర్మన్నపాలెంలో రూ.37.90 లక్షలతో చేపట్టిన బస్ షెల్టర్ ఆధునికీకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.
- జోన్–8 పరిధి ఎయిర్‌పోర్టు వద్ద రూ.33.60 లక్షలతో నిర్మిస్తున్న బస్ షెల్టర్ ఫ్లోర్ స్లాబ్ పూర్తయింది. కాకానినగర్ వద్ద రూ.33.60లక్షలతో చేపడతున్న పనులు తుది దశకు చేరుకున్నాయి.

ప్రయాణికులకు సౌకర్యవంతంగా...



నగరాభివృద్ధే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నాం. జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డులు, ప్రధాన కూడళ్ల వద్ద రోడ్ల పనులు పూర్తయ్యాయి. జీ–20 సదస్సు నేపథ్యంలో కోట్లాది రూపాయలతో నగరాన్ని సుందరీకరించాం. పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్న నగరంలో సుమారు రూ.4.62 కోట్లతో 20 బస్ షెల్టర్లు ఆధునికీకరిస్తున్నాం. ఈ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

ఏయూ బస్ షెల్టర్ తరహాలో..



జీ–20 సదస్సులో భాగంగా ఏయూ ఔట్ గేట్ వద్ద ఆధునికీకరించిన బస్ షెల్టర్ తరహాలోనే నగరంలో 20 బస్ షెల్టర్లను తీర్చిదిద్దుతున్నాం. పలు బస్ షెల్టర్ల పనులు తుది దశకు చేరుకున్నాయి. మరి కొన్ని బస్ షెల్టర్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పనులన్నీ పూర్తి చేసి త్వరలోనే వీటిని నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం.

– సాయికాంత్ వర్మ, కమిషనర్, జీవీఎంసీ

సీఎం జగన్‌కు ఘన స్వాగతం







సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీలు విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు



గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక విమానంలో బుధవారం ఉదయం 9.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 9.20 గంటలకు హెలికాప్టర్‌లో ఇక్కడి నుంచి కురుపాం బయలుదేరి వెళ్లారు. ఆయన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అదీప్‌రాజ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ముఖ్యమంత్రితో కలిసి హెలికాప్టర్‌లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కురుపాం వెళ్లారు. కురుపాం నుంచి హెలికాప్టర్‌లో సీఎం వైఎస్ జగన్ 2.53 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి 3.14 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 30న స్థాయీ సంఘ సమావేశం జరగనుంది. అభివృద్ధి పనులకు సంబంధించి స్థాయీ సభ్యుల ఆమోదానికై పలు అంశాలు చర్చకు రానున్నాయి. బీచ్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ డౌన్ జంక్షన్ వరకు రూ.49.50 లక్షలతో ల్యాండ్‌స్కేప్ సెంట్రల్ మీడియన్‌కు ఎంఎస్ గ్రిల్స్ ఏర్పాటు, రెల్లివీధి బీటీఆర్ కాలనీలో రూ.43.71 లక్షలతో కమ్యూనిటీ హాల్‌పై మొదటి అంతస్తు నిర్మాణం, రూ.38.39 లక్షలతో డ్వాక్రా గ్రూప్‌ల సమావేశానికి రెండో ఫ్లోర్ నిర్మాణం, నీలకంఠనగర్ రక్షణ గోడ పునర్‌నిర్మాణం, ఫాగింగ్ కార్యకలాపాలు నిర్వహించేందుకు రోజువారి వేతన ప్రాతిపదిన ఆరుగురు డ్రైవర్లు, ఒక ఫాగింగ్ మెషీన్ ఆపరేటర్–స్లం లెవెల్ ఫెడరేషన్ ప్రక్రియ ద్వారా ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టడం, జోన్–5లో తొలగించిన చెట్ల కొమ్మలు, చెత్తను కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు మూడు నెలల కాలానికి ఆరు సీఎంటీ టిప్పర్, ఇద్దరు వర్కర్లను ఏర్పాటు చేసేందుకు రిజిస్టర్ కాంట్రాక్టర్ ద్వారా నామినేషన్ పద్ధతిలో పనులు చేపట్టడం తదితర అంశాలు చర్చకు రానున్నాయి.

నిబంధనల మేరకే ముందుకెళ్లాం

- తూర్పు నియోజకవర్గంలో 40 వేల ఓట్లు అక్రమంగా తొలగించారంటూ ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు
- విచారణ అనంతరం.. సక్రమమేనని స్పష్టం చేసిన ఈసీ
- రాజకీయ కోణం లేదని స్పష్టం చేసిన ఎన్నికల కమిషన్

సాక్షి, విశాఖపట్నం : తెలుగుదేశం పార్టీ నేతలకు నిజాలు అవసరం లేదు.. అబద్ధాలు ప్రచారానికి ఆలోచన చెయ్యట్లేదు. ఏ చిన్న విషయం దొరికినా.. ఎల్లో మీడియా సహకారంతో ప్రభుత్వాన్ని తప్పుబడుతూ వ్యతిరేక కథనాలు వండి వార్చేందుకు చేస్తున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. ఇదే రీతిలో తూర్పు నియోజకవర్గ ఓటర్ల తొలగింపు విషయంలో వాస్తవాలు పరిశీలించకుండా టీడీపీ అడ్డగోలు ఆరోపణలు చేసి చివరికి అభాసుపాలైంది. 40 వేల మంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన కమిషన్.. నిబంధనల మేరకే ఓట్లు తొలగించారంటూ స్పష్టం చేసింది.

తూర్పు నియోజకవర్గంలో 40 వేల మంది ఓట్లను రాజకీయ కక్షతో తొలగించారంటూ టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఫిర్యాదు చేయడం.. దాన్ని ఎల్లో మీడియాలో తాటికాయంత అక్షరాలతో కథనాలు రాయడంపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి స్పందించారు. నియోజకవర్గం పరిధిలోని ప్రతి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఓటరుకు సంబంధించిన చిరునామాని సంప్రదించి.. వాస్తవ పరిస్థితుల్ని సేకరించారు. 2022 జనవరి 5వ తేదీ నాటికి తూర్పు నియోజకవర్గంలో 2,73,480 మంది ఓటర్లుండగా.. 2023 జూన్ 13 నాటికి 2,50, 612 మంది మాత్రమే ఉన్నారనీ.. ఇందులో 40 వేల మందిని తొలగించారంటూ టీడీపీ ఆరోపించింది. ఈ ఆరోపణల్లో ఏ మాత్రం వాస్తవం లేదన్నది రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహించిన విచారణలో స్పష్టమైంది.

శాశ్వత వలస ఓటర్లను తొలగించకూడదా..?

వాస్తవానికి తూర్పు నియోజకవర్గ పరిధిలో మొత్తం 32,080 మంది ఓటర్లను తొలగించారు. ఇందులో ఆ నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు 17,769 మంది ఉన్నారు. మరణించిన ఓటర్లు 1,226 మంది ఉండగా.. డూప్లికేట్ ఓటర్లుగా 13,085 మందిని గుర్తించిన బూత్ లెవల్ అధికారులు.. వారిని నిబంధనల మేరకు జాబితా నుంచి తొలగించారు. ఏ నియోజకవర్గంలోనైనా ఈ మూడు కారణాలతోనే ఓటర్లను తొలగించే ప్రక్రియ రాష్ట్రంలోనే కాదు.. యావత్ దేశంలోనూ నిర్వహిస్తున్నారు. కానీ.. ఇదేదో రాజకీయ కక్ష అంటూ వెలగపూడి విషం కక్కడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదేవిధంగా.. 15,798 మంది ఓటర్లను కొత్తగా చేర్చారంటూ ఎల్లో మీడియా కథనాలు ప్రచురించింది. అయితే.. 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలంటూ.. ఎన్నికల కమిషన్ ప్రచారం నిర్వహించడంతో కొత్త ఓటర్లకు సంబంధించి వేల దరఖాస్తులతో పాటు చిరునామా మార్పునకు సంబంధించి కూడా పెద్ద సంఖ్యలో అప్లికేషన్లు రాగా.. ఇందులో కేవలం 9,212 మందిని మాత్రమే కొత్తగా ఓటర్లుగా నమోదు చేశారు. ఇవన్నీ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకే నిర్వహించినట్లు విచారణాధికారులు నివేదికలో పొందుపరిచారు. అంటే టీడీపీ ఇచ్చిన ఫిర్యాదులో ఏ మాత్రం వాస్తవం లేదని కొట్టి పారేశారు.

ప్రతి ఓటుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం...

కేవలం తూర్పు నియోజకవర్గం పరిధిలోనే కాదు.. జిల్లా మొత్తం ప్రతి ఒక్క ఓటును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. తూర్పు నియోజకవర్గంలో ఒకే డోర్ నంబర్‌తో 10 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్న కుటుంబాలు 2,491 ఉన్నట్లు గుర్తించాం. వారి అడ్రస్ మార్చుకోవాలనీ.. ఫారం–8 నింపి చిరునామా ధ్రువపత్రం జత చేసి ఇవ్వాలని కూడా సూచించాం. 222 మంది తాత్కాలిక వలస వెళ్లిన ఓటర్లను తొలగించిన వారిపై ఇప్పటికే క్రమశిక్షణ చర్యలు చేపట్టాం.

– డా.మల్లికార్జున, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

అమ్మఒడితో ఆర్థిక భరోసా

- సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం
- జిల్లాలో 1,70,467 మందికి లబ్ధి
- రూ.255.70 కోట్లు పంపిణీ
- కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



అమ్మఒడి చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

పెదగంట్యాడ : పిల్లల సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. విద్యార్థుల ఎదుగుదల కోసం తల్లిదండ్రులు ఈ నిధులను వినియోగించాలని కోరారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడంతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే విధంగా పాఠశాలల్లో అదనపు తరగతి గదులు కూడా నిర్మించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో బుధవారం జగనన్న అమ్మఒడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలో సుమారు 1,70,467 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.255 కోట్ల 70లక్షల 5వేలు జమ చేశారని వివరించారు. అమ్మఒడికి సంబంధించి అర్హత ఉండి ఎటువంటి కారణం చేతనైనా రాక పోయి ఉంటే సంబంధిత సచివాలయంలో తెలియజేస్తే వారు పరిశీలించి వచ్చే విడతలో మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటారన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. అమ్మఒడి పథకాన్ని దేశంలోనే ప్రప్రథమంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తల్లుల ఖాతాల్లోనే నేరుగా నిధులు మంజూరు చేసి వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, డీఈవో చంద్రకళ, సర్వ శిక్ష అభియాన్ ఏపీడీ శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నర్సింహపాత్రుడు, పాఠశాల హెచ్ఎం రాచకొండ శ్రీనివాసరావు, నాయకులు మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, సుమన్‌రెడ్డి, తల్లులు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోలేం



నా కుమార్తె భాగ్యశ్రీ నెల్లిముక్కు ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. నా భర్త కూలి పనులు చేస్తుంటాడు. కుమార్తె చదువుకోసం ఆర్థికంగా ఇబ్బందులు పడేవాళ్లం. మూడేళ్ల నుంచి క్రమం తప్పకుండా అమ్మఒడి నగదు అందుతోంది. చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేం. జీవితాంతం ఆయన వెంటే నడుస్తాం.

– సీహెచ్ రమణమ్మ, నెల్లిముక్కు


సీఎంకు ధన్యవాదాలు



నా కుమారుడు జశ్వంత్ నడుపూరు జిల్లా పరిషత్ 7వ తరగతి చదువుతున్నాడు. కూలిపనులు చేసుకుంటూ ఇల్లు గడుపుతున్నాం. నా కుమారుడు చదువుకోసం అప్పులు చేసే పరిస్థితి ఉండేది. మూడేళ్లుగా అమ్మఒడి నగదు అందుతోంది. నా కుమారుడు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. పేదల కోసం పని చేస్తున్న ఆయనకు ధన్యవాదాలు

– ఎం.రమణి, పెదగంట్యాడ

'మట్టి బుర్ర' రాతలు



ఎర్ర మట్టి దిబ్బలు

- భీమిలి ప్రాంతమంతా ఎర్ర మట్టే..
- నేరెళ్లవలసలో 262.92 ఎకరాల్లోనే ఎర్ర మట్టి దిబ్బలు
- జీఎస్ఐ నిర్ధారించినదీ ఇదే..
- వాటికి దూరంగా కొత్తవలసలో భూముల అభివృద్ధి
- ఇవి లాండ్ పూలింగ్‌లో రైతుల నుంచి సేకరించిన భూములు
- ఎర్ర మట్టి దిబ్బలకు, ఈ భూములకు సంబంధమే లేదు
- కొత్తవలస ఫొటోలు పెట్టి, ఎర్రమట్టి దిబ్బలంటూ అసత్యాలు
- ప్రజలను తప్పుదోవ పట్టించేందకు ఈనాడు తప్పుడు రాతలు

ఫ్యాక్ట్ చెక్

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఎర్రగా కనిపించిన భూమంతా ఎర్ర మట్టి దిబ్బలేనా?.. అంటే కాదనే అంటారు ఎవరైనా. కానీ, పచ్చ కళ్ల ఈనాడుకి అన్నీ ఎర్ర మట్టి దిబ్బల్లానే కనిపిస్తున్నాయి. అందుకే ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం అంటూ విషపు కథనాలని ప్రజల పైకి వదిలారు రామోజీ. జాతీయ భౌగోళిక వారసత్వ సంపదగా, చారిత్రక, పర్యాటక ప్రాంతంగా ఉన్న ఎర్ర మట్టి దిబ్బలు ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులకు ఎటువంటి విఘాతం కలగకుండా పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న ప్రణాళికలు ఈనాడుకు కనిపించలేదు. ఎర్రమట్టి దిబ్బలకు చాలా దూరంలో రైతుల నుంచి లాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూములను విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధి చేస్తుంటే.. ఎర్ర మట్టి దిబ్బలను ధ్వంసం చేస్తున్నారంటూ ఓ అసత్య కథనం అల్లింది. భారత భూగర్భ పరిశోధనా సంస్థ (జీఎస్ఐ) భీమిలి మండలంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బల హద్దులను స్పష్టంగా నిర్దేశించింది. దానికి వందల మీటర్లు దూరంలో రైతుల నుంచి సేకరించిన భూముల్లో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి పనులు చేపట్టింది.భీమిలి పరిసర ప్రాంతాల్లో భూమంతా ఎర్ర మట్టే. అభివృద్ధి చేస్తున్న ప్రాంతం కూడా ఎర్రగా ఉండటంతో ఆ ప్రాంతాలను ఎర్రమట్టి దిబ్బలుగానే పేర్కొంటూ ఈనాడు కథనం ఇవ్వడం ఆ ప్రాంతవాసులను, రైతులను విస్మయానికి గురి చేసింది. ఈ పనుల వల్ల ఎర్రమట్టి దిబ్బలకు ఎటువంటి ప్రమాదం ఉండదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు.

262.92 ఎకరాల్లోనే ఎర్రమట్టి దిబ్బలు

భీమునిపట్నం మండలం నేరెళ్లవలస గ్రామంలో చారిత్రక వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బలను గుర్తించారు. జీఎస్ఐ నిపుణులు 2014 సంవత్సరంలో వీటిపై సర్వే చేశారు. సర్వే నంబర్ 49/1లో 262.92 ఎకరాల్లో ఈ ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. అదే ఏడాది జూలై 19న ఆ ప్రాంతాన్ని వారసత్వ సంపదగా నిర్ధారించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ ప్రాంతం 'ఇసుక దిబ్బలు–గయాలు'గా ఉంది.

కొత్తవలస ఫొటోలతో అసత్య కథనాలు

భీమిలి మండలం కొత్తవలస గ్రామంలో సర్వే నంబర్ 75, 86, 87లో గయాలు భూములు ఉన్నాయి. ఈ భూములకు, ఎర్రమట్టి దిబ్బలకు ఎటువంటి సంబంధం లేదు. వాటికి చాలా దూరంలో ఉంటాయి. అదీ కూడా బఫర్ జోన్‌కు 45 మీటర్ల దూరంలో ఉంటాయి. వీటిని దశాబ్దాల క్రితం ల్యాండ్‌లెస్ పూర్ కేటగిరీ కింద 18 మందికి కేటాయించారు. వారు చాలా ఏళ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రెవెన్యూ అధికారులు లాండ్ పూలింగ్ ద్వారా ఆ 18 మంది నుంచి భూములను సేకరించారు. 2020లో వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. వీఎంఆర్‌డీఏ ఈ భూములను అభివృద్ధి చేసేందుకు చదును చేస్తోంది. ఇదే అదనుగా ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేస్తున్నారంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈనాడు అసత్య కథనాలు ప్రచురిస్తోంది. కొత్తవలసలో భూముల అభివృద్ధి పనుల ఫొటోలను నేరెళ్లవలసలో ఉన్న ఎర్రమట్టి దిబ్బల్లో జరుగుతున్నట్టుగా చిత్రీకరిస్తూ తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది.

ఎర్రమట్టి దిబ్బలకు సంబంధం లేదు



వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తున్న భూములకు, ఎర్ర మట్టి దిబ్బలకు ఎటువంటి సంబంధం లేదు. జీఎస్ఐ గుర్తించిన 262.92 ఎకరాల్లోని ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దానికి దూరంలో కొత్తవలసలో భూములను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తోంది. ఈ భూములు రైతుల నుంచి సేకరించినవి. అక్కడ నేల కూడా ఎర్రగా ఉన్నంత మాత్రాన అవి ఎర్రమట్టి దిబ్బలు కావు. దీనిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతం

- సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో లభ్యమైన ఆచూకీ
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు, పోలీసులు


సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముగ్గురు విద్యార్థులతో పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకు చెందిన ముగ్గురు ఇంటర్ విద్యార్థుల అదృశ్యం కథ సుఖాంతమైంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో వారి ఆచూకీ లభ్యమైందని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపారు. వివరాలివీ.. గాజువాక శ్రీ చైతన్య కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గంగ్రెడ్డి ఉమేష్ పవన్, పిల్లల దిలీప్, ఉప్పాడ దంతేశ్వర్ ఈ నెల 24న కళాశాలకు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయారు. అయితే కళాశాలకు రాలేదని సాయంత్రం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందింది. దీంతో వారి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే అదే రోజు కె.కోటపాడులోని దిలీప్ ఇంటికి వీరంతా వెళ్లి భోజనం చేశారు. ఆ సమయంలో అతని తల్లిదండ్రులు ఇంట్లో లేరు. అక్కడి నుంచి మళ్లీ గాజువాక చేరుకున్నారు. అనంతరం విశాఖ రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైలు ఎక్కారు. వీరి వద్ద ఫోన్ లేకపోవడంతో రైలు నుంచి వేరొకరి ఫోన్‌తో దిలీప్ తన తమ్ముడికి ఫోన్ చేశాడు. సికింద్రాబాద్‌లోని మామయ్య ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. తర్వాత తన మామయ్యకు కూడా ఫోన్ చేసి సికింద్రాబాద్ వస్తున్నట్లు తెలిపాడు. అయితే ఎప్పుడు వస్తున్నారో చెప్పలేదు. 25న సికింద్రాబాద్‌లో దిగిన వీరు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా అక్కడే గడిపారు. మరోవైపు పోలీసులు వీరు కె.కోటపాడు వెళ్లడం, తిరిగి గాజువాక, అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సీసీ ఫుటేజ్ దృశ్యాలను సేకరించారు. మూడు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ప్రారంభించారు. మిస్సింగ్ అయిన విద్యార్థుల ఫొటోలను అన్ని స్టేషన్లకు పంపించారు. కాగా.. బుధవారం దిలీప్ తన మామయ్యకు మళ్లీ ఫోన్ చేసి తామంతా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉన్నామని తెలిపారు. అతను రైల్వే పోలీసుల సహకారంతో స్టేషన్‌లోనే పట్టుకున్నారు. ఈ విషయాన్ని ఇక్కడ పోలీసులకు తెలిపారు. విద్యార్థులను ఇక్కడకు తీసుకొచ్చేందుకు పోలీసులు సికింద్రాబాద్ బయలుదేరారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి లేకపోవడం, ఎక్కడైనా పనులు చేసుకుని బతుకుదామని ఈ చర్యకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. విద్యార్థుల ఆచూకీ లభ్యం కావడంతో వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.



OBITUARY

Our beloved mother,
an epitome of kindness, goodness,
gentleness and generosity
stepped into eternal glory
on 27th June 2023.

Grace Vijayam Roy, MA
(1948-2023)
W/o Late Mr SHW Roy

Burial
Waltair Christian Cemetery, Vizag 10:00 am
29th June 2023 - Audrey, Asa, Alfred. (+91 76391 76125)

ఐటీ హబ్‌గా అవతరిస్తోన్న విశాఖ

ఏపీఈఐటీఏ జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

కొమ్మాది: ఐటీ హబ్‌గా విశాఖ అవతరిస్తోందని ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ (ఏపీఈఐటీఏ) జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. రుషికొండ ఐటీ హిల్–2లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ చొరవతో రానున్న రోజుల్లో పలు ఐటీ కంపెనీలు విశాఖకు రానున్నాయన్నారు. 1,000 మంది సిబ్బందితో ఇన్ఫోసిస్ ఇక్కడి నుంచి త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ను ప్రమోట్ చేయడంతో దిగ్గజ సంస్థలు విశాఖకు క్యూ కడుతున్నాయన్నారు. ఫార్మా కంపెనీలు కూడా త్వరలో విశాఖకు రానున్నాయని చెప్పారు. జూలై 21, 22, 23 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్ (జీఎస్ఎఫ్) పేరుతో ఓ కార్యక్రమాన్ని ఐటీ శాఖ తరఫున ఏపీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ విశాఖలో నిర్వహించనుందని, దీనికి వీ ఇన్ఫో టెక్నాలజీస్ సారథ్యం వహిస్తున్నట్లు సంస్థ సీఈవో వంకాయల సాయికుమార్ తెలిపారు. దీనికి 54 వర్సిటీల విద్యార్థులతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు వస్తున్నాయని యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయమని తెలిపారు. కొన్ని నెలలుగా వీ ఇన్ఫోటెక్ కంపెనీపై కొన్ని పత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

'ఎనర్జీ ఆఫ్ ఇండియా'గా ఇండియన్ ఆయిల్


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

బీచ్‌రోడ్డు: ఇండియన్ ఆయిల్... చమురు, గ్యాస్, పెట్రో కెమికల్స్, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు సహా దాదాపు అన్నింటిలో కార్యకలాపాలు నిర్వహిస్తూ 'ఎనర్జీ ఆఫ్ ఇండియా'గా ఖ్యాతి గడించిందని ఇండియన్ ఆయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెడ్ బి.అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ శ్రీలంక, మారిషస్, యూఏఈ తదితర దేశాలలో ఇండియన్ ఆయిల్ వ్యాపార కార్యకలాపాల ద్వారా ప్రపంచ ఆకాంక్షలు నెరవేరుస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ 500 కంపెనీల జాబితాలో 142వ స్థానంలో ఉందన్నారు. ప్రతి రోజూ 36,285 రిటైల్ అవుట్‌లెట్ల నెట్‌వర్క్ ద్వారా విలువైన పెట్రోలియం ఇంధనాలను దేశంలోని ప్రతి మూలకు చేరుస్తుందన్నారు. సంస్థకు 132 ఏవియేషన్ ఇంధన కేంద్రాలు, 108 ఎల్పీజీ బాట్లింగ్ ప్లాంట్లు, 14.6 కోట్ల వినియోగదారులతో సహా 4.54 కోట్ల పీఎంయూవై కస్టమర్లకు ప్రతి రోజూ దాదాపు 27 లక్షల సిలిండర్లను అందజేస్తున్నామని చెప్పారు. ఇండియన్ ఆయిల్ రూ.2 లక్షల కోట్ల పెట్టుబడితో 2046 నాటికి నెట్ జీరో నిర్వహణ ఉద్గారాల లక్ష్యం సాధించాలని సంకల్పించిందన్నారు. కార్యక్రమంలో సీజీఎం సీసీ ఎస్ఆర్ వీ వెట్రి సెల్వకుమార్, సీజీఎం ప్లానింగ్, కోఆర్డినేషన్ వీ బాలసుబ్రహ్మణ్యం, సీజీఎం రిటైల్ సేల్స్ సుబ్రాత్ రాత్, ఎల్పీజీ జీఎం యోగార్ని సురేష్ పాల్గొన్నారు.

నూజివీడుకు బాస్కెట్ బాల్ జట్ల పయనం

విశాఖ స్పోర్ట్స్: నూజివీడులో గురువారం నుంచి జరిగే స్టేట్ అంతర్ జిల్లాల జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు జిల్లా జట్లు పయనమయ్యాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు బాలికల విభాగంలో 12 మందిని, బాలుర విభాగంలో 12 మందిని జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఎంపిక చేసింది.


ఫుడ్‌కోర్టులో 90 దుకాణాలకే అనుమతులు

- అనధికారికంగా ఉన్న 149 దుకాణాలను తొలగిస్తాం
- అద్దె ప్రాతిపదికన డ్రా పద్ధతిలో కొత్తగా కేటాయిస్తాం
- జీవీఎంసీ ఫుడ్ కమిటీ నిర్ణయం


వివరాలు వెల్లడిస్తున్న ఫుడ్ కమిటీ చైర్మన్ సతీష్

డాబాగార్డెన్స్: జీవీఎంసీకి ఆదాయం తీసుకొచ్చేలా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్, ఫుడ్ కమిటీ చైర్మన్ కటుమూరి సతీష్ వెల్లడించారు. ఫుడ్‌కోర్టు కమిటీ నిర్ణయాల మేరకు దుకాణ యజమానులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఫుడ్ కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిటీ ఏర్పడిన నాటి నుంచి నాలుగు సార్లు సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. సెంట్రల్ పార్కు వద్ద అనధికారికంగా 149 మంది వ్యాపారాలు చేసుకుంటున్నట్టు గుర్తించామని, వీరంతా జీవీఎంసీకి ఒక్క రూపాయి చెల్లించకుండానే వ్యాపారాలు చేసుకుంటున్నట్టు పరిశీలనలో తేలిందన్నారు. పలువురు దుకాణదారులు దర్జాగా విద్యుత్ చౌర్యం చేస్తున్నట్టు గుర్తించామన్నారు. అనధికారికంగా నడుస్తున్న ఫుడ్ కోర్టును త్వరలోనే తొలగిస్తామన్నారు. జీవీఎంసీ నిబంధనల మేరకు 90 దుకాణాలకు మాత్రమే అనుమతిచ్చేలా ప్రాథమిక నివేదిక రూపొందించి మేయర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఒకరికి ఒక షాపు ప్రాతిపదికన ఆధార్ కార్డు అనుసంధానంతో వెండర్ కార్డులు జారీ చేస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఒకే కుటుంబం చెందిన వారు నాలుగైదు చోట్ల దుకాణాలు నడుపుతున్నారని గుర్తించామన్నారు. అందరికీ ఉపాధి కింద ఒకరికి ఒకే షాపు కేటాయిస్తున్నట్లు చెప్పారు. దుకాణాల సైజు బట్టి స్థలం కేటాయిస్తామని.. రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు ప్రతి నెలా జీవీఎంసీకి అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఉన్న వారికే ప్రాధాన్యం ఇస్తామని.. డ్రా పద్ధతిలో 90 మందికి దుకాణాలు కేటాయిస్తామన్నారు. ఆ తర్వాత బీచ్‌రోడ్డులో గుర్తించిన 8 హాకర్స్ జోన్లలో దుకాణాలు కేటాయిస్తామని వెల్లడించారు. గాజువాక, అనకాపల్లి జోన్లలో కూడా ఫుడ్‌కోర్టులు ఏర్పాటు చేస్తామని వివరించారు. సభ్యులు ముహమ్మద్ సాధిక్, ఉరుకూటి నారాయణరావు, భీశెట్టి వసంత లక్ష్మి, బొండా జగన్నాథం, పీలా లక్ష్మి పాల్గొన్నారు.

'కనకమహాలక్ష్మి బ్యాంకు లాభం రూ.9.32 కోట్లు'


విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న అధ్యక్షుడు

సీతమ్మధార: ది కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 24వ మహాసభ బుధవారం ఘనంగా జరిగింది. మద్దిలపాలెంలోని కాకతీయ కన్వెన్షన్ సెంటర్‌లో బ్యాంకు అధ్యక్షుడు కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పరుచూరు రఘునాథరావు మాట్లాడారు. 24 ఏళ్లుగా తనకు సహకరించినట్టే.. నూతన అధ్యక్షులకు కూడా సహకరించాలని సభ్యులను కోరారు. రాంబాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా బ్యాంకు కార్యకలాపాలు సాగిస్తూ.. అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బ్యాంకు రూ.773 కోట్ల డిపాజిట్లను కలిగి ఉందని, రూ.469 కోట్ల రుణాలు మంజూరు చేసిందన్నారు. రూ.9.32 కోట్ల నికర లాభంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లను సభ్యులకు పరిచయం చేశారు. ఉత్తమ మార్కులు సాధించిన సభ్యుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. డైరెక్టర్లు ఎం.రాఘవేంద్రరావు, బి.నాగేశ్వరరావు, ఆర్.వెంకటేశ్వరరావు, సి.పి.రామారావు పాల్గొన్నారు.